వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
శనివారం, ఆగస్టు 08, 2026




# క్రమశిక్షణతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- డీజీపీ సి.వి.ఆనంద్
- 4వ బెటాలియన్‌లో డీజీపీ పర్యటన
- ఎస్డీఆర్ఎఫ్ రెస్క్యూ పరికరాల పరిశీలన
- పోలీసు అధికారులతో ముఖాముఖి
- బెటాలియన్ ఆవరణలో మొక్క నాటిన డీజీపీ



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)సి.వి. ఆనంద్ 4వ బెటాలియన్‌ను సందర్శించారు. బెటాలియన్‌కు చేరుకున్న డీజీపీకి కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం బెటాలియన్ పోలీసు సిబ్బంది డీజీపీకి గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్స్ అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్, వరంగల్ పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత, డీసీపీలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులతో ముఖాముఖి సమావేశమైన డీజీపీ సి.వి. ఆనంద్.. వారి విధులు, సంక్షేమం, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అందరూ అంకితభావంతో, అత్యుత్తమ క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ, "ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా ప్రతి పోలీసు సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, శిక్షణ మరియు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుని బెటాలియన్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలి" అని దిశానిర్దేశం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా సిబ్బంది ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో భాగంగా బెటాలియన్‌లోని ఎస్డీఆర్ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) సిబ్బంది ఏర్పాటు చేసిన రెస్క్యూ పరికరాలు, సాంకేతిక సామగ్రి ప్రదర్శనను డీజీపీ ఆసక్తిగా తిలకించారు. వరదలు, ప్రమాదాలు, నీట మునకలు మరియు ప్రకృతి విపత్తుల సమయంలో వినియోగించే అతధునిక రెస్క్యూ పరికరాల పనితీరును ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది ఆయనకు వివరించారు. విపత్తు సమయాల్లో అనుసరించే విధానాలు, సమన్వయం మరియు రక్షణ పరికరాల వినియోగాన్ని పరిశీలించిన డీజీపీ.. సిబ్బంది ప్రదర్శించిన నైపుణ్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. విపత్తు నిర్వహణలో ఎస్డీఆర్ఎఫ్ సామర్థ్యాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా బెటాలియన్ ఆవరణలో డీజీపీ సి.వి.ఆనంద్ మొక్కను నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుచేస్తూ.. బెటాలియన్ ప్రాంగణంలో మరిన్ని మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్స్ బాలయ్య, వీరన్న, రాజేందర్; ఆర్ఐలు కార్తీక్, విజయ్, రవి, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, కృష్ణతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# విశ్వదీప్తి పాఠశాలలో పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్ ప్రారంభం


**మల్హర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండలంలోని కొయ్యూరు గ్రామంలోని విశ్వదీప్తి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సరికొత్త పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్‌ను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ విషయాన్ని పాఠశాల కరెస్పాండెంట్ ఎం.కె. సుదర్శనన్ మీడియాకు వెల్లడించారు. ఈ కోచింగ్ సెంటర్ ద్వారా విద్యార్థులకు ఒలింపియాడ్, నీట్, ఐఐటి ఫౌండేషన్ తో పాటు నవోదయ, గురుకుల, ఏకలవ్య, సైనిక్ స్కూల్ వంటి ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక నిపుణుల ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మిస్టర్ జోసెఫ్ జార్జ్ మరియు కొయ్యూరు గ్రామ సర్పంచ్ కొండ రాజమ్మ విచ్చేశారు. వారు రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేయడం ద్వారా కోచింగ్ సెంటర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఇలాంటి పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడం



ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకొని ఉన్నత పరీక్షల్లో రాణించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మెర్సీ వర్గీస్, పీటీఏ ప్రెసిడెంట్ కోడూరి సంతోష్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# హనుమకొండలో అరుదైన శస్త్రచికిత్స

## అతుక్కున్న కిడ్నీలను విజయవంతంగా వేరు చేసిన వైద్యులు



**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** హనుమకొండలోని శ్రీ శ్రీనివాస కిడ్నీ సెంటర్‌లో వైద్యులు అత్యంత అరుదైన, క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. 12 సంవత్సరాల బాలుడికి ఎడమ కిడ్నీ కుడి వైపునకు ఉండడంతో పాటు, రెండు కిడ్నీలు అతుక్కుపోయి ఉన్న సమస్యను లాప్రోస్కోపిక్ పద్ధతిలో విజయవంతంగా తొలగించినట్లు ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ ఏ.రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మేడ్చల్ జిల్లా కుషాయిగూడ మండలం కాప్రాకు చెందిన సబ్బాని పూర్ణచంద్ర (12) అనే బాలుడు తీవ్రమైన కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. బాలుడికి ఎడమ కిడ్నీ కుడి కిడ్నీ వైపు ఉండడమే కాకుండా, రెండు కిడ్నీలు అతుక్కొని పనిచేయకపోగా ఇన్ఫెక్షన్‌కు గురయ్యాయి. ఈ అరుదైన వైద్య చికిత్సను వైద్య పరిభాషలో 'లెఫ్ట్ టు రైట్ క్రాస్డ్ ఫ్యూజ్డ్ ఎక్టోపిక్ కిడ్నీ'అంటారు. లాప్రోస్కోపిక్ పద్ధతిలో అత్యంత నైపుణ్యంతో శస్త్రచికిత్స నిర్వహించారు. రెండు కిడ్నీలు ఒకే వైపు అతుక్కొని ఉండడం వల్ల, బాగా పనిచేసే కిడ్నీ రక్తనాళాలు మరియు మూత్ర నాళాలు అత్యంత సమీపంలో ఉంటాయి. ఇటువంటి క్లిష్టమైన సందర్భంలో ఎడమ కిడ్నీని కుడి కిడ్నీ నుండి వేరు చేయడం వైద్యపరంగా చాలా సవాల్‌తో కూడుకున్నది. సుమారు 2 గంటల 30 నిమిషాల పాటు ఈ సర్జరీ కొనసాగింది. ఆపరేషన్ జరిగిన 72 గంటల్లోనే బాలుడు పూర్తిగా కోలుకోవడంతో వైద్యులు డిశ్చార్జ్ చేశారు. ప్రస్తుతం బాలుడు ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. ఈ విజయవంతమైన శస్త్రచికిత్సలో డాక్టర్ రాంప్రసాద్ రెడ్డితో పాటు డాక్టర్ రిజ్వాన్, డాక్టర్ సామ్రాట్ తదితర వైద్య బృందం పాల్గొంది. అత్యంత క్లిష్టమైన ఈ ఆపరేషన్‌ను విజయవంతం చేసిన వైద్యులను పలువురు అభినందించారు.

# తెలంగాణలో బీజేపీకి మూడో స్థానం

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అత్యంత అప్రజాస్వామికంగా, ఈడీ మరియు సీబీఐలను దుర్వినియోగం చేస్తూ అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్రంలోని ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. దేశంలో అసలు ప్రజాస్వామ్యం బతికే ఉందా అనే అనుమానం కలుగుతోందని, అందుకే దేశంలో నిరసన గళాలు పుట్టుకొస్తున్నాయని మల్లు రవి అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో బ్రిటిష్ ప్రభుత్వం లాఠీఛార్జ్ చేసిన విధంగానే శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్న వారిపై దమనకాండ సాగిస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పటికీ కేంద్ర హోంమంత్రి కనీసం సభకు రాలేదని విమర్శించారు. నక్సలైట్లది రాజ్యాంగేతర ఉద్యమమని, వారిది ప్రజాస్వామ్య ఉద్యమం కాదని పేర్కొంటూనే... తాము మాత్రం రాజ్యాంగానికి లోబడే ఆందోళనలు చేస్తున్నామని స్పష్టం చేశారు. "బెంగాల్ మా ఫస్ట్ టార్గెట్ అయిపోయింది, నెక్స్ట్ తెలంగాణ" అని బీజేపీ నేతలు అంటున్నారని, కానీ పశ్చిమ బెంగాల్‌కు, తెలంగాణకు ఎలాంటి సారూప్యత లేదని మల్లు రవి తేల్చిచెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి మూడో స్థానం వస్తుందో లేదో కూడా గ్యారంటీ లేదని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వంద శాతం మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అస్సాం, బీహార్ తరహాలో తెలంగాణలో రాజకీయం చేయాలని బీజేపీ చూస్తోందని, కానీ ఇక్కడ ఆ కుట్రలు సాగవని హెచ్చరించారు. తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన సాగుతోందని, ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు ఇచ్చి యువతకు భరోసా కల్పించామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో కేసీఆర్ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ప్రతి పేదవాడికి ఇల్లు ఉండాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన మాటి ప్రకారం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏకంగా 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందన్నారు. అలాగే పేద ప్రజలను ఆదుకునేందుకు 200 యూనిట్ల ఉచిత కరెంట్, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళితేనే కేంద్ర మంత్రులలో కదలిక వస్తోందని, మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగు రోడ్డు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ కోసం ఆయన కేంద్రంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నారని మల్లు రవి వెల్లడించారు.